RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి : 13 సంచిక : 240 | ఆదివారం, ఫిబ్రవరి 08 2026 | ఎడిటర్ : బట్టు లక్ష్మినారాయణ, | పేజీలు : 6 వెల : రూ. 5.00

Hyderabad, Vijayawada, Vishakapatnam Tirupathi, Ananthapuram,Guntur,Nellor,Ongole,kadapa, Medak, Sangareddy, Siddipet, Nalagonda, Karimnagar,

# మున్సిపల్ ఎన్నికల్లో విజయం మాదే...

● మరో మూడేళ్లు అధికారంలో ఉండేది మేమే ● అభివృద్ధి చేస్తున్నాం.. ఇంకా చేసి చూపిస్తాం ● వికారాబాద్, పరిగి, తాండూర్‌లకు గోదావరి నీళ్లు పారిస్తాం ● కేసిఆర్ కట్టిన కాళేశ్వరం మూడేళ్లకే కూలేశ్వరంగా మారింది

● బిజెపి, బిఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలను తిప్పికొట్టండి ● వికారబాద్ జిల్లా పర్యటనలో సిఎం రేవంత్ పిలుపు



**హైదరాబాద్,ఫిబ్రవరి 7 :** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో గెలిచేది మళ్లీ కాంగ్రెస్ పార్టీయేనని సిఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మీరిచ్చిన అధికారంతో అభివృద్ధి పనులు చేస్తున్నామని అంటూ..వికారాబాద్, తండూర్, పరిగి ప్రాంతాలకు గోదావరి జలాలను తరలిస్తామని అన్నారు. ఇందుకు మంత్రి శ్రీధర్ బాబే సాక్ష్యం అంటూ హామీ ఇచ్చారు. వికారాబాద్ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా నారాయణపూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన-ప్రగతిబాట బహిరంగ సభ పాల్గొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంజూరైన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును కేసీఆర్ తన స్వార్థం కోసం అటకెక్కించారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. రంగారెడ్డి జిల్లాకు 3 టీఎంసీల గోదావరి జలాలను అందిస్తే లక్షలాది ఎకరాలు సాగులోకి వచ్చేవేనని, కానీ కేసీఆర్ నిర్లక్ష్యం వల్ల జిల్లా రైతాంగం బలైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ లక్ష కోట్లు వెచ్చించి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం మూడు ఏళ్లలోనే 'కూలేశ్వరం'గా మారిందని, ఆ ప్రాజెక్టు నిధులతో ఆయన కుటుంబ సభ్యులు ఫామ్ హౌసులు కట్టుకుని వ్యాపారాలు చేసుకున్నారని ఆరోపించారు. తాండూరు, పరిగి , వికారాబాద్ ప్రాంతాలను గోదావరి జలాలతో సస్యశ్యామలం చేసే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.స్వయం సహాయక సంఘాల మహిళలకు సీఎం రేవంత్ రెడ్డి ఇందిరా మహిళా శక్తి చెక్కుల పంపిణీ చేశారు ఈ సందర్భంగా మిగతా2లో...

## విద్యతో పాటు సంస్కారం కూడా నేర్పండి

● పిల్లలను తీర్చిదిద్దే బాధ్యత విద్యాలయాలదే

● మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు



**విశాఖపట్నం,ఫిబ్రవరి 7 :** విద్యాసంస్థల్లో పిల్లలకు విద్యతో పాటు సంస్కా రాన్ని కూడా నేర్పించాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. పిల్లలను సంస్కారవంతులుగా తీర్చిదిద్దే బాధ్యత విద్యాల యాలపై ఉందన్నారు. చదువు అంటే కేవలం ఉద్యోగం సంపాదించడమే కాదని, సమాజానికి ఉపయోగపడే మంచి వ్యక్తులుగా విద్యార్థులు ఎదగాలని సూచించారు. అభివృద్ధి అంటే భవనాలు కట్టడం మాత్రమే కాదని, ప్రకృతిని కాపాడుకునే బాధ్యత కూడా అందరిపై ఉందన్నారు. పెందుర్తిలోని బాలాజీ హై ఫీల్డ్స్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మిగతా2లో...

## ఎన్నాళ్లు కేంద్రాన్ని తిడుతూ పాలిస్తారు

● కెసిఆర్‌పై చర్యలు తీసుకుంటే అడ్డుకున్నదెవరు ● రేవంత్ తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి



**హైదరాబాద్,ఫిబ్రవరి 7 :** మాజీ సీఎం కేసీఆర్‌పై చర్యలు తీసుకుంటామంటే.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎవరు అడ్డుకున్నారో చెప్పాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చర్యలు తీసుకోవాల్సింది సీఎం కాదా అని ప్రశ్నించారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రికి చేతగాక.. బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ తమ కు అవసరం అని చెప్పుకోవాలి మిగతా2లో...

## హైదరాబాద్ ఫోరెన్సిక్ ల్యాబ్‌లో భారీ అగ్నిప్రమాదం

● దట్టంగా అలముకున్న పొగతో ఉక్కిరిబిక్కిరి

● మంటలను ఆర్పిన ఐదు ఫైర్ ఇంజన్లు




**హైదరాబాద్,ఫిబ్రవరి 7 :** హైదరాబాద్ నగరంలోని నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్‌లో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ల్యాబ్ భవనం మొదటి అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో దట్టమైన పొగ అలుము కుంది. సమాచారం అందుకున్న వెంటనే అగ్ని మాపక శాఖ అధికారులు ఘటనాస్థలికి చేరుకుని, ఐదు ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపుచేసారు. అయితే అత్యంత మిగతా2లో...



## మున్సిపాలిటీలన్నీ మా ఖాతాలోకే...

అభివృద్ధి చేస్తున్న కాంగ్రెస్‌కే ప్రజల మద్దతు

విపక్షాలు అభివృద్ధికి అడ్డం పడుతున్నాయి

మంత్రి పొన్నంతో కలసి మీడియా సమావేశంలో తుమ్మల

**సిద్దిపేట,ఫిబ్రవరి 7 :** పంచాయితీ ఎన్నికల తరహాలోనే మున్సిపల్ ఎన్నికల్లోనూ విజయం సాధిస్తామని, మెజార్టీ సీట్లను కాంగరెస్ గెలుచుకుంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండు సంవత్సరాలుగా అసాధ్యమని భావించిన ఎన్నో సమస్యలను తమ ప్రభుత్వం పరిష్కరించిందని స్పష్టం చేశారు. కేవలం అసూయతోనే ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని, ప్రజలు వారిని ఎప్పుడో తిరస్కరించారని ఆయన ఎద్దేవా చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ వేదికగా జరిగిన మీడియా సమావేశంలోతుమ్మల నాగేశ్వర్ రావు ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి పాల్గొన్న ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక నిర్ణయాలను మంత్రి తుమ్మల గుర్తు చేశారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా మిగతా2లో...

## మలేసియాలో త్వరలో కొత్త కాన్సులేట్ ఏర్పాటు

కౌలాలంపూర్‌లో ప్రధాని మోడీ ప్రకటన

ఘనంగా స్వాగతం పలికిన ప్రవాస భారతీయులు




**కౌలాలంపూర్,ఫిబ్రవరి 7 :** మలేసియాలో త్వరలో కొత్త కాన్సులేట్ ఏర్పాటు చేయనున్నట్టు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. రెండ్రోజుల మలేసియా పర్యటన నిమత్తం శనివారంనాడు కౌలాలంపూర్ చేరుకున్న ఆయనకు మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం సాదర స్వాగతం పలికారు. భారతీయ సంప్రదాయ మిగతా2లో...

## అణు ఒప్పందం కుదుర్చుకోవాల్సిందే.. ఇరాన్‌పై ట్రంప్ ఒత్తిడి



**న్యూఢిల్లీ, 7 :** తమ దేశంతో అణు ఒప్పం దాన్ని కుదుర్చుకో వాల్సిందిగా ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి మిగతా 2లో...




## క్వాంటమ్ కంప్యూటింగ్‌కు కేంద్ర సహకారం

టెక్నాలజీ అభివృద్ధిలో కీలకం కానుందన్న కేంద్రమంత్రి

**అమరావతి,ఫిబ్రవరి 7 :** నేషనల్ క్వాంటమ్ మిషన్‌ను కేంద్రం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్రసింగ్ తెలిపారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీకి సీఎం చంద్రబాబుతో కలిసి మిగతా2లో...

## మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

బస్తర్ జిల్లాలో లొంగిపోయిన 51మంది మావోలు



**రాయపూర్,7 :** మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్ జిల్లా బస్తర్ డివిజన్‌లో 51 మంది మావోయిస్టులు లొంగిపోయారు. మిగతా2లో...

## పోచారం కాంగ్రెస్‌లోకి ఎందుకెళ్లారు..?

- ప్రజలంతా ఆయనను నిలదీయాల్సిందే
- గతంలో తిట్టిన కాంగ్రెస్ పంచన చేరిన పోచారం
- అమలుకాని హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస
- బాన్సువాడ కార్నర్ మీటింగ్‌లో కెటిఆర్ విమర్శలు



2లో

గ్రూప్-1పై మళ్లీ సుప్రీంకోర్టుకు

## న్యాయపోరాటానికి నిరుద్యోగులు సిద్ధం

**హైదరాబాద్:** గ్రూప్-1 నియామకాలపై న్యాయ పోరాటానికి నిరుద్యోగులు సిద్ధమయ్యారు. మళ్లీ సుప్రీం కోర్టును ఆశ్రయించాలని నిర్ణయిం చారు. గ్రూప్-1పై హైకోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. సింగిల్‌బెంచ్ తీర్పును సస్పెండ్ చేయడంతో ఇప్పటికే ఉద్యోగాలు పొందిన వారికి ఊరట లభించింది. హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పుపై న్యాయ నిపుణులను సంప్రదించి వీలైనంత త్వరగా సుప్రీం కోర్టులో కేసు వేసేందుకు ఏర్పా ట్లు చేసుకుంటున్నారు అన్ని స్థాయిల్లోనూ పోరా టంగ్రూప్-1పై అభ్యర్థులు, నిరుద్యోగ జేఏసీ నేతలు పోరాటం చేస్తున్నారు. ఇప్పటికే ఒకసారి జీవో-29పై సుప్రీంకోర్టుకు వెళ్లారు. ఆ తర్వా త ఫైనల్‌కీపై ఉన్నత న్యాయస్థానం తలుపులు తట్టారు. ఫైనల్ కీలో అనేక తప్పులున్నాయని, తమ అభ్యంతరాలను టీజీపీఎస్సీ పట్టించు లేద ని, తమకు న్యాయం చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# మున్సిపల్ ఎన్నికల్లో విజయం మాదే...

(మొదటి పేజీ తరువాయి)

సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను, తప్పులను సరిదిద్దుకుంటూ తమ ప్రభుత్వం రాష్ట్ర ప్రగతి కోసం ముందుకు వెళుతోందని ఆయన స్పష్టం చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్, కేంద్రంలో పన్నెండేళ్లుగా ఉన్న మోదీ రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శించిన ఆయన, బీజేపీ , బీఆర్ఎస్ పార్టీల మధ్య 'చీకటి ఒప్పందాలు' ఉన్నాయని సంచలన ఆరోపణలు చేశారు. బీజేపీ కార్యకర్తలు తమ బీ–ఫామ్‌లను బీఆర్ఎస్ ఆఫీసుల నుండి తెచ్చుకుంటున్నారని ఎద్దేవా చేస్తూ, గల్లీలో పనిచేసే నాయకుడిని చూసి కాకుండా ఢిల్లీలో ఉండే పెళ్లి పెద్దను చూసి ఓట్లు వేయడం ఏమిటని ప్రజలను ప్రశ్నించారు. జిల్లా అభివృద్ధికి సంబంధించి ముఖ్యమంత్రి పలు కీలక ప్రకటనలు చేశారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ భూసేకరణను త్వరలోనే పూర్తి చేసి, ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. మక్తల్, నారాయణపేట , కొడంగల్ నియోజకవర్గాలకు కృష్ణా జలాలను తరలించి 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పా జంక్షన్ నుండి మన్నెగూడ రోడ్డు పూర్తి కాకపోవడం వల్ల జరిగిన ప్రాణనష్టానికి కేసీఆర్, సబితా ఇంద్రారెడ్డిలే బాధ్యులని విమర్శించిన రేవంత్ రెడ్డి, ప్రస్తుతం కోర్టు కేసులను పరిష్కరించి ఆ రోడ్డు పనులను వేగవంతం చేశామని వెల్లడించారు. భవిష్యత్తులో రీజనల్ రింగ్ రోడ్డు , రేడియల్ రోడ్లు రాబోతున్నాయని, వికారాబాద్ త్వరలోనే ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ చరిత్రను తాను చెరిపేయాలని చూస్తున్నానని కేటీఆర్, హరీష్ రావు చేస్తున్న విమర్శలకు ముఖ్యమంత్రి ఘాటుగా స్పందించారు. కేసీఆర్ దొంగ పాస్‌పోర్టుల చరిత్ర, దొంగ నోట్ల వ్యవహారం , దళితుడిని సీఎం చేస్తానన్న దొంగ హామీల చరిత్ర తెలంగాణ ఉన్నంత కాలం చెరిగిపోదని, ఆ 'పాపాల భైరవుడి' చరిత్ర ప్రజలకు గుర్తుండేలా చేసే బాధ్యత తనదని ఆయన వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ లాంటి చిల్లర పనులకు నోటీసులు ఇవ్వక ఏం చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే 70 వేల ఉద్యోగాల భర్తీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ వంటి హామీలను అమలు చేశామని గుర్తు చేస్తూ, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో విషం చిమ్మే పాములకు మళ్ళీ పాలు పోయకుండా కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రెండేళ్ల ప్రజాపాలనలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

# పోచారం కాంగ్రెస్‌లోకి ఎందుకెళ్లారు

**కామారెడ్డి,ఫిబ్రవరి 7 :**కాంగ్రెస్ పార్టీలోకి పోచారం శ్రీనివాస్ రెడ్డి ఎందుకు పోయారో బాన్సువాడ ప్రజలకు సమాధానం చెప్పవలసిన అవసరం ఉందని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో తెలంగాణలో స్వర్ణయుగం నడిచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పేదల కోసం కేసీఆర్ అనేక పథకాలను ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. కానీ అడ్డగోలు హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కేటీఆర్ పాల్గొన్నారు. ముందుగా కొయ్యగుట్టలో అమర వీరుల స్తూపం వద్ద కేటీఆర్ నివాళులర్పించారు. కొయ్యగుట్ట నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి ఆయన భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ పాల్గొన్నారు. కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ మాట్లాడుతూ .. పోచారం శ్రీనివాస్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. బాన్సువాడలో పోచారం శ్రీనివాస్ రెడ్డిని నమ్మి గెలిపిస్తే ఏం చేశాడని ప్రశ్నించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆయన తనయులు దోచుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి గతంలో అన్న విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. ఒక ఆంబోతు, రెండు దున్నపోతు లంటూ విమర్శించలేదా అని ప్రశ్నించారు. అయినప్పటికీ వెళ్లి రేవంత్ రెడ్డి పక్కకు చేరాడని విమర్శించారు. ఈ సందర్భంగా గతంలో పోచారం శ్రీనివాస్ రెడ్డిని రేవంత్ రెడ్డి తిట్టిన తిట్లను ఫోన్‌లో పెట్టి ప్రజలకు వినిపించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి బండ కట్టుకొని బాయిలో దుంకాలె అని మండిపడ్డారు. కాంగ్రెస్‌లోకి ఎందుకు వెళ్లారో పోచారం శ్రీనివాస్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని ఓటేసి గెలిపించిన పోచారం శ్రీనివాస్ రెడ్డిని గల్లా పట్టి అడగాలని సూచించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి బాన్సువాడ సిగ్గు తీసిండని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందని కేటీఆర్ అన్నారు. తామే బాన్సువాడను మున్సిపాలిటీ చేశామని గుర్తుచేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో బాన్సువాడ నియోజకవర్గంలో 10వేల కోట్లతో అభివృద్ధి జరిగిందని వివరించారు. భవనాలు, ఆస్పత్రి, కులసంఘాల భవనాలకు రూ.500 కోట్లు ఇచ్చామని తెలిపారు. 42వేల మందికి ఆసరా పెన్షన్లు, 70 వేల మందికి రైతుబంధు, 14వేల మందికి రైతుబీమా ఇచ్చామని పేర్కొన్నారు. 15 వేల మందికి కల్యాణ లక్ష్మి, 30 వేల మందికి కేసీఆర్ కిట్లు అందించామని చెప్పారు. ఆ నిధులు అన్నీ కేసీఆర్ ఇచ్చిండని.. పోచారం పీకిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌లోకి వెళ్లాక ఒక్క రూపాయి కూడా పోచారం తీసుకురాలేదని విమర్శించారు. కాంగ్రెస్ నేతల మాటలు నమ్మొద్దని సూచించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డికి కేసీఆర్ ఏం అన్యాయం చేశాడని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి వేసే ఎంగిలి మెతుకులకు పోచారం ఎగిరెగిరి పడ్డాడని విమర్శించారు. బాన్సువాడ ప్రజలు గులాబీ జెండా ఎగురాలని అనుకుంటున్నారని అన్నారు. పోచారం లాంటి దొంగలకు సద్దులు కట్టింది చాలని కాంగ్రెస్ నాయకులకు హితవు పలికారు. కాంగ్రెసోళ్లు బంగారం ఇచ్చేవాళ్లు కాదు.. మెడలో పుస్తెలతాడు ఎత్తుకెళ్లే బ్యాచ్ అని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ నేతలు దండుపాళ్యం బ్యాచ్.. స్టువర్టుపురం దొంగలని ఎద్దేవా చేశారు. కొయ్యగుట్ట నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి ఆయన భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చిందని.. వాటిలో ఒక్క హామీనైనా నెరవేర్చిందా అని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో తులం బంగారం లేదు.. స్కూటీలు లేవు.. ఆరు గ్యారెంటీలు లేవని విమర్శించారు. రైతుబంధు లేదు.. రైతు భరోసా లేదని అన్నారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని చెప్పి మోసం చేశారని అన్నారు. అసలు కాంగ్రెస్ చెప్పిన నాలుగు వేల పెన్షన్ ఎవరికైనా వస్తుందా అని ప్రశ్నించారు. ఫ్రీ బస్సు పేరుతో రేవంత్ రెడ్డి మహిళలను మోసం చేస్తున్నాడని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ మనిషి కాదు అని అన్నారు. మోదీ, రేవంత్ రెడ్డి ఇద్దరూ తోడు దొంగలని ఆరోపించారు. రేవంత్, ప్రధాని మోదీ మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌నే గెలిపించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.రేవంత్ రెడ్డి ఏనాటికైనా బీజేపీ మనిషే, ఆయన కప్పుకున్న ముసుగు తొలగించి చూడాలని కేటీఆర్ ప్రజలను కోరారు. రేవంత్ ఏనాటికీ కాంగ్రెస్ మనిషి కాలేదని, ఆయన ముందు నుంచి బీజేపీ మనిషి అని, రేవంత్ ముమ్మాటికి బడే భాయ్ తమ్ముడు అని కేటీఆర్ అన్నారు.

# హైదరాబాద్ ఫోరెన్సిక్ ల్యాబ్‌లో భారీ అగ్నిప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

రద్దీగా ఉండే ఈ ఆప్రాంతంలో పక్కనే నీలోఫర్ ఆస్పత్రి కూడా ఉంది. ఆ ప్రాంతమంతా పొగలు కమ్ముకోవడంతో సహాయ చర్యలకు తీవ్ర అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. అగ్నిమాపక సిబ్బంది ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాంచారు. ఈ ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, ఘటనపై పూర్తి వివరాలను దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేదు. పోలీసులు ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ, ఎవరినీ ల్యాబ్ లోపలికి వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.ఓకాగా.. ఉదయం 10:00 గంటల ప్రాంతంలో మొదటి ఫ్లోర్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో మంటలు చెలరేగాయి. దీంతో ఆ ఫ్లోర్‌లోని కంప్యూటర్లు, ఫోరెన్సిక్ సంబంధిత కెమికల్స్‌తో సహా కీలకమైన పత్రాలు కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనలో పలు ముఖ్యమైన కేసులకు సంబంధించిన ఫోరెన్సిక్ రిపోర్టులు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ మంటల్లో ఫోన్ ట్యాపింగ్‌కు కేసుకు సంబంధించిన హార్డ్ డిస్కులూ కాలిపోయినట్లు సమాచారం.నిమిషాల వ్యవధిలోనే మంటలు భవనంలోని ఇతర ప్రాంతాలకు వ్యాపించాయి. దీంతో లోపల ఉన్న కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయాయి. అగ్నిప్రమాదం కారణంగా ఆ ప్రాంతమంతా దట్టంగా నల్లటి పొగ అలుముకుంది. ప్రమాదాన్ని గమనించిన కార్యాలయ సిబ్బంది ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. అగ్ని ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని ఐదు ఫైరిరజన్లతో మంటలనున అదుపులోకి తీసుకొచ్చారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని అధికారులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. కాగా, ప్రమాదం గురించి తెలియగానే నార్త్ జోన్ డీఐజీ శ్వేత, ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి ల్యాబ్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ల్యాబ్‌లో కీలకమైన కేసులు, ఫోరెన్సిక్ ఆధారాలకు సంబంధించిన డాక్యుమెంట్లు ఏవైనా దెబ్బతిన్నాయా అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు. కాగా, ఈ అగ్ని ప్రమాదంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఓటుకు నోటు కేసు సహా పలు కీలక కేసులకు సంబంధించిన డాక్యుమెంట్లు, ఎవిడెన్స్‌లు ఇక్కడే ఉండటంతో ఈ అగ్ని ప్రమాదం వెనుక కుట్ర కోణం ఉండొచ్చని అంటున్నారు.

# ఎన్నాళ్లు కేంద్రాన్ని తిడుతూ పాలిస్తారు

(మొదటి పేజీ తరువాయి)

కానీ.. కిషన్ రెడ్డి మీదనో, కేంద్ర ప్రభుత్వం మీదనో నిందలు వేయొద్దని హితవు పలికారు. కిషన్‌రెడ్డిని అడ్డుపెట్టి సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కువ రోజులు తప్పించుకోలేరన్నారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలని ఏ ఒక్క రోజైనా రాహుల్‌గాంధీ.. రేవంత్ రెడ్డిని ఆదేశించారా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌పై చర్యలకు రాహుల్ గాంధీ అడ్డుపడకుంటే తక్షణమే చెప్పాలని డిమాండ్ చేశారు. మోదీని అడ్డుకోవడం కోసం సోనియా కుటుంబం, కేసీఆర్ కుటుంబం ఏకమయ్యాయని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. బీఆర్ఎస్, కాంగ్రెస్.. ఎవరు అధికారంలో ఉంటే వారు మజ్లిస్‌ను ప్రసన్నం చేసుకుంటున్నారని ఆరోపించారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు ఈ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తమను విమర్శించే ముందు సీఎం రేవంత్ ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవు పలికారు. రేవంత్ తనను కల్వకుంట్ల కిషన్ రావు అని విమర్శించారని.. తానెలా కల్వకుంట్ల కిషన్ రావు అవుతాను? అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబాన్ని కాపాడాల్సిన అవసరం తనకు ఎందుకుంటుందని నిలదీశారు. పనికిరాని, పసలేని ఆరోపణలు చేయడం రేవంత్ రెడ్డికి బాగా అలవాటైందని కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. రేవంత్ చెత్త విమర్శలకు తాను చాలాసార్లు కౌంటరిచ్చానని అన్నారు. మళ్లీ మళ్లీ ఆయన పిచ్చి ప్రేలాపనలు చేయొద్దని.. ఈ విషయాన్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కేంద్రంపై అనవసరంగా మాట్లాడితే ఊరుకోమని హెచ్చరించారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి నాడు ఇందిరాగాంధీని గెలిపిస్తే.. ఆ జిల్లా ప్రజలకు, తెలంగాణకు ఆమె ఏం చేశారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక దేశంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని కిషన్ రెడ్డి వివరించారు. తమ ఎంపీలకు మోదీ సమ ప్రాధాన్యం ఇస్తారని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత కేంద్రం తెలంగాణకు ఏం చేసిందో చెబుతామని తెలిపారు. ఈ ఎన్నికల ప్రచారానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ వచ్చే అంశంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉందని కిషన్ రెడ్డి తెలిపారు.

## ఈఎన్‌సిగా రమేశ్ బాబు నియామకం

**హైదరాబాద్,ఫిబ్రవరి 7** ఎట్టకేలకు తెలంగాణ ప్రభుత్వం నీటిపారుదల శాఖ ఈఎన్సీని నియమించింది. గత నెలలో పదవీ విరమణ పొందిన అంజద్ హుస్సేన్ స్థానంలో ఓలేటి వెంకట రమేశ్ బాబును నియమించింది. ఈ మేరకు నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇరిగేషన్ శాఖ ఈఎన్సీ నియామకంపై ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వెంకట రమేశ్‌బాబుకు ఈఎన్సీగా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఆయన సూర్యాపేట, ఖమ్మం జిల్లాల చీఫ్ ఇంజినీర్ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఇరిగేషన్‌లో ఈఎన్సీ(జనరల్) స్థానం అత్యంత కీలకం. గతంలో ఈ శాఖను 19 టెరిటోరియల్స్‌గా విభజించగా మైనర్, మీడియం, మేజర్ ప్రాజెక్టులన్నీ ఒకే గొడుగు కిందికి తీసుకొచ్చి ఆయా చీఫ్ ఇంజి నీర్లకే బాధ్యతలను అప్పగించింది. అన్ని విభాగాలపై పూర్తిస్థాయి నిర్ణయాధికారాన్ని ఈఎన్సీకే కట్టబెట్టింది. ఇరిగేషన్ శాఖ, డ్యామ్ సేఫ్టీకి సంబంధించి రాష్ట్రస్థాయి కమిటీల్లోనూ ఈఎన్సీకే పూర్తి అధికారాలున్నాయి. ఇప్పటివరకు ఈఎన్సీగా పనిచేసిన అంజద్ హుస్సేన్ జనవరి 31న విరమణ పొందారు. సాధారణంగా కీలకమైన స్థానం ఖాళీ అవుతుంటే ముందుగానే తాత్కాలికంగానైనా ఇన్‌చార్జిని నియమించడం పరిపాటి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వారం రోజులైనా భర్తీ చేయకపోవడం ఇటీవల చర్చనీయాంశంగా మారింది. అయితే ఈఎన్సీ జనరల్ స్థానం భర్తీ కాకపోవడానికి ప్రధాన కారణం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ మధ్య పేచీనే కారణమనే చర్చ జోరుగా వినిపిస్తున్నది.

# క్వాంటమ్ కంప్యూటింగ్‌కు కేంద్ర సహకారం

(మొదటి పేజీ తరువాయి)

శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో జితేంద్రసింగ్ మాట్లాడారు.ఈ పునాది రాయి.. దేశ క్వాంటమ్ మిషన్‌కు మూలం కానుందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏపీ త్వరగా అందిపుచ్చుకుంటోంది. డీప్ సీ మిషన్‌కు త్వరగా అనుమతులు ఇచ్చాం. 2024 తర్వాత ప్రతి చోటా క్వాంటమ్ టెక్నాలజీ పదమే వినిపిస్తోంది. క్వాంటమ్ కంప్యూటింగ్ ద్వారా వైద్యరంగంలో పెను మార్పులు వస్తాయి. క్వాంటమ్ మిషన్ అన్ని రంగాల్లో కీలకం కానుంది. అందుకే నేషనల్ క్వాంటమ్ మిషన్‌కు రూ.6వేల కోట్లు కేటాయించాం అని కేంద్రమంత్రి వివరించారు. ఆవిష్కరణ సమయంలో అన్నీ చిన్నగానే కనిపిస్తాయి. కొన్నాళ్ల తర్వాత తెలుస్తుంది ఆ ఆవిష్కరణల విలువ ఏమిటో అని అన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్.. కమ్యూనికేషన్‌లోనూ కీలక మార్పులు తేనుందని కేంద్రమంత్రి తెలిపారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్రమంత్రులు నారా లోకేశ్, నారాయణ, కందుల దుర్గేశ్ తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

వీరిపై రూ.1.61 కోట్ల రివార్డు ఉంది. వీరంతా బస్తర్ ఎస్పీ జితేందర్ యాదవ్ సమక్షంలో శనివారంనాడు లొంగిపోయారు. బస్తర్ జిల్లా ప్రధాన కార్యాలయమైన జగదల్‌పూర్‌లో బస్తర్ పాండుమ్ 2026 ఫెస్టివల్ ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర మంత్రి అమిత్‌షా రాయపూర్ వచ్చిన రోజునే ఇంత పెద్దసంఖ్యలో మావోయిస్టులు లొంగిపోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. జిజాపూర్ జిల్లాలో 20 మంది మహిళా క్యాడర్‌తో సహా 30 మంది మావోయిస్టులు లొంగిపోయారని, మరో 21 మంది సుక్మా జిల్లాలో లొంగిపోయారని ఎస్పీ సుందరరాజ్ తెలిపారు. వీరిలో 14 మంది మహిళా క్యాడర్ ఉన్నారని చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టుల నుంచి కా÷–డగ్గ÷క్స్ వైర్‌లు, జెలటిన్ స్టిక్‌లో స్వాధీనం చేసుకున్నామన్నారు. లొంగిపోయిన ప్రతి మావోయిస్టుకు 50 వేల తక్షణ ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పునరావాస చర్యలతో స్వచ్ఛందంగా వీరంతా లొంగిపోయినట్టు చెప్పారు. కాగా, తక్కిన మావోయిస్టు క్యాడర్ కూడా హింసను విడనాడి జనజీవన స్రవంతిలో కలవాలని, వారికి భద్రత, గౌరవంగా జీవించేందుకు అవసరమైన పునరావసం కల్పిస్తామని సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ కోరారు.

# మలేసియాలో త్వరలో కొత్త కాన్సులేట్ ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)

నృత్యాలతో ప్రవాస భారతీయులు ఆహ్వానం పలికారు. అనంతరం కౌలాలంపూర్ లోని భారత సంతతి ప్రజలతో ఆత్మీయ సమ్మేళనంలో మోదీ పాల్గొన్నారు. భారత్ పదేళ్లలో వేగంగా సాధిస్తున్న ప్రగతిని ఈ సందర్భంగా మోదీ వివరిస్తూ, పదేళ్ల క్రితం 11వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారతదేశం ప్రస్తుతం మూడో స్థానానికి చేరిందన్నారు. ఇండియాలో చదువుకునే విద్యార్థులకు త్వరలోనే తిరువళ్లువర్ స్కాలర్‌షిప్‌లు ఇస్తామని చెప్పారు. యూకే, యూఏఈ, అస్ట్రేలియా, న్యూజిలాండ్, ఒమన్, ఈయూ, అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుందని, విశ్వాసం భారతదేశపు బలమైన కరెన్సీగా మారిందని పేర్కొన్నారు. ఇండియాను ఒక పెద్ద మార్కెట్‌గానే గతంలో చూసేవారని, ఇప్పుడు పెట్టుబడులు, వాణిజ్యానికి హబ్‌గా మారిందని మోదీ తెలిపారు. అభివృద్ధికి విశ్వసనీయమైన భాగస్వామిగా భారత్ నిలుస్తోందన్నారు. యూకే, యూఏఓ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఒమన్, ఈయూ, యూఎస్ఏ సహా అనేక దేశాలు ఇండియాతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నాయని చెప్పారు. మలేసియాను ప్రపంచం లోనే అతిపెద్ద భారతీయ ప్రవాస జనాభాను కలిగిన రెండో దేశంగా మోదీ పేర్కొన్నారు. భారత్–మలేసియా ప్రజల హృదయాలను కలుపుతూ, రెండు దేశాల మధ్య వారధిగా ప్రవాస భారతీయులు నిలుస్తున్నారని ప్రశంసించారు. ఆహారపు అలవాట్లు, భాషా పరంగా ఎన్నో ఇరుదేశాల ప్రజల మధ్య ఎన్నో సామీప్యాలు ఉన్నాయని అన్నారు. భారతీయ సంగీతం, చలనచిత్రాలకు మలేసియాలో ఎంతో ఆదరణ ఉన్నట్టు విన్నానని, ప్రధాని అన్వర్ ఇబ్రహీం కూడా బాగా పాడతారనే విషయం ఇక్కడి వారందరికీ తెలిసిందేనని అన్నారు. భారత్‌కు తిరిగి వచ్చిన చాలామందికి ఈ విషయం తెలియదని, తాను గత పర్యటనలో ఆశ్చర్యానికి గురయ్యానని చెప్పారు. ఇండియాలోని పాపులర్ హిందీ గీతాలను అన్వర్ ఇబ్రహీం ఆలపిస్తున్న వీడియోలు వైరల్ అయ్యాయని, లెజెండ్రీ ఎంజీఆర్ తమిళ పాటలను ఆయన బాగా ఇష్టపడతారని అన్నారు. దీనికి ముందు, భారత్‌కు చెందిన 800 మందికి పైగా నృత్యకారులు ప్రధానికి విమానాశ్రయం వద్ద స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్ట్ నుంచి మోదీ, అన్వర్ ఇబ్రహీం కలిసి ఒకే కారులో ప్రయాణించారు. భారత సంతతి ఆత్మీయ సమ్మేళనం వద్ద 'భారత్ మాతా కీ జై', 'మోదీ, మోదీ' అనే నినాదాలతో ఆయనకు సాదర స్వాగతం లభించింది.

# అణు ఒప్పందం కుదుర్చుకోవాల్సిందే.. ఇరాన్‌పై ట్రంప్ ఒత్తిడి

(మొదటి పేజీ తరువాయి)

ఒత్తిడి చేశారు. అలా చేయకపోతే పర్యవసనాలు ఏమిటో ఇరాన్‌కు తెలుసునని పరోక్షంగా సైనిక చర్యను ఉద్దేశించి ట్రంప్ వ్యాఖ్యానించారు.ఒప్పందం కోసం మస్కట్‌లో ఇరాన్, అమెరికా చర్చలు జరుపుతున్న నేపథ్యంలో ట్రంప్ నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఓ భారీ నౌక ఇరాన్ వైపు కదులుతోందని శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ చెప్పారు. ప్రస్తుత చర్చలు సానుకూలంగానే ఉన్నట్లు ఆయన తెలిపారు. చర్చలపై ఇరాన్ దౌత్యవేత్త ఒకరు స్పందిస్తూ సానుకూలంగానే చర్చలు ప్రారంభమయ్యాయని ఆయన చెప్పారు.

# విద్యతో పాటు సంస్కారం కూడా నేర్పండి

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం.. భారతదేశమని అన్నారు వెంకయ్యనాయుడు. ఈ మధ్యకాలంలో కొంతమంది నాయకులు విర్రవీగుతూ బూతులు తిడుతున్నారని విమర్శించారు. అలాంటి వారికి ప్రజలు పోలింగ్ బూత్‌లోనే తగిన సమాధానం చెప్పాలన్నారు. రాజకీయ నాయకులకు బూతులు మాట్లాడటం ఒక ఫ్యాషన్‌లా మారిపోయిందని మండిపడ్డారు. ఎంత ఎక్కువ బూతులు మాట్లాడితే అంత పబ్లిసిటీ వస్తుందని కొందరు భావిస్తున్నారని విమర్శించారు. రాజకీయ నాయకులు అందరికీ ఆదర్శంగా ఉండాలని మాజీ ఉపరాష్ట్రపతి సూచించారు. కార్యక్రమంలో పెందుర్తి శాసనసభ్యులు కంచికల రమేశ్ బాబు, విశాఖపట్నం మేయర్ పీల శ్రీనివాస్‌లతో పాల్గొన్నారు. ఇందులో భాగంగా స్కూల్ పిల్లలతో కొంతసేపు సరదాగా మాట్లాడిన మాజీ ఉపరాష్ట్రపతి.. ఆ తర్వాత స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు.

# మున్సిపాలిటీలన్నీ మా ఖాతాలోకే...

(మొదటి పేజీ తరువాయి)

బీసీ కులగణన చేపట్టిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన గర్వంగా ప్రకటించారు. తెలంగాణను ఆదర్శంగా తీసుకునే నేడు కేంద్ర ప్రభుత్వం కూడా తలవంచి కులగణన చేపట్టబోతోందని ఆయన పేర్కొన్నారు. అలాగే ఎస్సీ వర్గీకరణ విషయంలో దశాబ్దాల నాటి కల సాకారం చేస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ. 13,000 కోట్లు వెచ్చించి పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని ఆయన వెల్లడించారు. గత పదేళ్ల పాలనలో ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన వారే నేడు నీతులు మాట్లాడుతున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రైతాంగం, పేదలు, నిరుద్యోగులు సంతోషంగా ఉంటే ఓర్వలేక ప్రతిపక్షాలు కారుకూతలు కూస్తున్నాయి. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ , పంచాయతీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పని అయిపోయిందని ప్రచారం చేశారు, కానీ ప్రజలు తమ ఓటుతో మమ్మల్ని ఆశీర్వదించి వారికి బుద్ధి చెప్పారు' అని తుమ్మల గుర్తు చేశారు. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో కూడా అదే స్థాయిలో ప్రతిపక్షాల విమర్శలకు ప్రజలు సమాధానం చెబుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.రాష్ట్ర అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆశించిన స్థాయిలో సహకరించకపోయినప్పటికీ, అవసరమైతే తల తాకట్టు పెట్టయినా సరే అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని మంత్రి తుమ్మల తేల్చి చెప్పారు.

RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

హైదరాబాద్ ఎస్టేట్

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

తెలుగు దిన పత్రిక

# అమీర్పేట్ గ్రామం ఇంటి స్థలము కబ్జా గురి కాకుండా ఆపాలి షేక్ హాజీ బాబా మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు



హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం అమీర్పేట్ గ్రామంలో ఇంటి స్థలం కబ్జాకు గురికాకుండా ఆపాలని జిల్లా పంచాయతీ అధికారి రంగారెడ్డి జిల్లా మరియు పలువురు అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది. మా యొక్క ఇంటి స్థలముగా మహేశ్వరం కోర్టులో కేసు విచారణలో ఉన్నది. మరియు ఇబ్రహీంపట్నం కోర్టులో కేసు విచారణలో ఉన్నది. మరియు హైకోర్టులో కేసు విచారణలో ఉన్నది.మా యొక్క ఇంటి స్థలమును కబ్జాకు గురికాకుండా ఆపాలని కోరడమైనది. మాకు రక్షణ కల్పించాలని కోరడం జరిగింది. అమీర్పేట గ్రామానికి చెందిన పలువురు మా యొక్క స్థలములోకి వచ్చి జెసిబి వాహనంతో చదును చేస్తున్నారు మేము ఆపడానికి వెళితే మాపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారు బూతు మాటలు తింటున్నారు మమ్ములను భయాందోళనకు గురి చేస్తున్నారు కనుక ప్రభుత్వ అధికారులు పోలీసు అధికారులు ఈ యొక్క స్థలముపై న్యాయ విచారణ చేపట్టాలని మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు షేక్ హాజీ బాబా కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో మహమ్మద్ సలావుద్దీన్. మొహమ్మద్ జలాలుద్దీన్. మహమ్మద్ హబీబుద్దీన్. మొహమ్మద్ నురుద్దీన్. మహమ్మద్ వాజిద్ డప్పు జంగయ్య. తదితరులు పాల్గొన్నారు.

# కల్వకోల్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటికి ముగ్గు పోసిన సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ రవి మాదిగ


హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కల్వకోల్ గ్రామంలో చాకలి నాగలక్ష్మి కి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగింది. ఇంటి పనులను ప్రారంభించిన గ్రామ సర్పంచ్.... బక్కని లక్ష్మమ్మ రవి మాదిగ మహేశ్వరం మండల పరిధిలోని కల్వకోలు గ్రామంలో ఇందిరమ్మ ఇంటి పనులను సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ రవి మాదిగ గ ఆధ్వర్యంలో ప్రారంభించారు..ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జనార్ధన్ గౌడ్ ,వార్డ్ సభ్యులు బొజ్జం శివకుమార్, తిరుమలి యాదయ్య, బొజ్జం మల్లేష్ గూడెపు కుమార్, కొండని శేఖర్, గుర్రంపల్లి మహేందర్, బొజ్జం శ్రీనివాస్, గ్రామపంచాయితీ సెక్రటరీ శ్రీనివాస్, మరియు గ్రామ పెద్దలు ఆరడి వెంకటేష్, పులిమామిడి లక్ష్మినారాయణ గౌడ్, శాయిని జైపాల్ రెడ్డి, గుర్రంపల్లి మల్లేష్, బక్కని రాజు, కిష్టయ్య, రాఘవేందర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ను అధికారంలోకి తెచ్చిన నిరుద్యోగుల నోట్లో మట్టి కొడుతున్న ప్రభుత్వం

(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి 7:-




తెలంగాణ జాగృతి పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ..మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ శాఖల్లో దొడ్డిదారిన ఉద్యోగాల నియామకాలకు ప్రయత్నాలు దొడ్డిదారి నియామకాల గురించి కవిత దృష్టికి తీసుకువచ్చిన పలువురు నిరుద్యోగులుఅక్రమ మార్గాల్లో ఉద్యోగాల భర్తీకి చేస్తున్న ప్రయత్నాలను నిలిపి వేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్, రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగి యువత నిర్వేదంలో ఉన్నారు. ప్రభుత్వం ఎప్పుడెప్పుడు ఉద్యోగాల నోటిఫికేషన్స్ వేస్తుందా అని ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం గ్రామాల నుంచి ఎంతో మంది యువకులు హైదరాబాద్ వచ్చి ట్రైనింగ్ తీసుకుంటున్నారు. వేల రూపాయలు ఖర్చు చేసి ప్రభుత్వ ఉద్యోగాల కోసం ట్రెయినింగ్ తీసుకుంటున్నారు. తెలంగాణ వస్తే తమకు ఉద్యోగాలు వస్తాయని యువత ఉద్యమంలో బలంగా కొట్లాడింది. కానీ తెలంగాణ వచ్చాక చిన్నపాటి ఉద్యోగాలు మాత్రమే వేశారు.

ఒక క్రమపద్ధతిలో పరీక్షలు నిర్వహించలేదు. పైగా ఒకే విద్యార్థి రకరకాల ఉద్యోగాలకు పరీక్ష రాయకుండా ఒకే రోజు రెండు పరీక్షలు నిర్వహించారు. దీంతో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే న్యాయం జరుగుతుందని యువత భావించింది. అందుకే గత అసెంబ్లీ ఎన్నికల్లో యువత గ్రామాల్లో తిరిగి ఓటర్ల కాళ్లు పట్టుకొని మరీ కాంగ్రెస్ కు ఓటు వేయించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జాబ్ క్యాలెండర్ వస్తుందని నమ్మారు. కానీ ఏ నెలలో ఏ జాబ్ వస్తుందో కూడా స్పష్టత లేని పరిస్థితి ఉంది. బీఆర్ఎస్ ఉన్నప్పుడు స్టేట్ లెవల్ పోస్టులను కూడా ప్రొవిజన్ అనే చిన్నపదాన్ని పట్టుకొని పరీక్షలు లేకుండానే ఉద్యోగం ఇచ్చారు. లక్షన్నర జీతం ఉ?

# ఓడి పోతాననే భయంతోనే చిల్లర రాజకీయాలు

**- పోలీస్ స్టేషన్ లో పిర్యాదు బీజేపీ7వ వార్డు అభ్యర్థి ఆకుల సంతోష్ కుమార్.**

(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి 7:-



ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా బీజేపీ 7వ వార్డు అభ్యర్థి ఆకుల సంతోష్ కుమార్ ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. అనంతరం మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,కాంగ్రెస్, బి ఆర్ ఎస్ అభ్యర్థులు గోడకు అతికించిన బీజేపీ గోడ పత్రికను చింపి తగలబెట్టారని, తన ప్రజా ఆదరణ చూసి ఓర్వలేక ఓడిపోతామనే భయంతోనే బీజేపీ గోడ పత్రిక చింపి తగలబెట్టారని అన్నారు. ఇంతటి దుర్మార్గపు చర్యలు చేసిన వారిని వెంటనే చట్ట రిత్యా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా బీజేపీ గెలవడం ఖాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవేందర్ జీ, అభినవ్ భాస్కర్ , బోజి రెడ్డి, నోముల కార్తీక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నం తీర్పు క్లియర్ కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

**- ఖానాపూర్ 10వ వార్డు లో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం.**

**- మంగళ హరతులతో ఘనస్వాగతం పలికిన మహిళలు.**

**- దొంతరామోని భార్గవి రాజు గెలుపు ఖాయం..ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి.**






(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి 7:-

మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా 10వ వార్డు అభ్యర్థి దొంతరామోని భార్గవిరాజు కి మద్దతుగా ఖానాపూర్ గ్రామంలో ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ప్రచారం నిర్వహించారు.. ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం అయ్యింది. ఖానాపూర్ గ్రామం కాంగ్రెస్ పార్టీ కంచుకోట భార్గవి రాజు గెలుపు ని ఎవరు అడ్డుకొలరని తెలిపారు.ఇబ్రహీంపట్నం మున్సిపల్ లొ గెలిచేదే కాంగ్రెస్ పార్టీనే. పట్నం ప్రజలు డిసైడ్ అయ్యారు. కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలే మా అభ్యర్థులను గెలిపిస్తాయి. అభివృద్ధి చేస్తున్నాం ఆశీర్వదించండి ఖానాపూర్ గ్రామ అభివృద్ధి బాధ్యత నాది, కాంగ్రెస్ అభ్యర్థిని ఆశీర్వదించండి.రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ మన గ్రామంలో ఉంటేనే అభివృద్ధి వేగవంతం అవుతుంది..90శాతం ఓట్లు వేసి నన్ను గెలిపించిన ఖానాపూర్ గ్రామ ప్రజలకు నేను ఏమిచ్చి ఋణం తీర్చుకోవాలి...ఖానాపూర్ గ్రామాన్ని అభివృధి చేసిన ఋణం తీర్చుకుంటా... ఇందిరమ్మ ఇడ్లు, రేషన్ కార్డులు ఇచ్చి ఋణం తీర్చుకుంటా... పేదరికన్ని నిర్ములన చేసి ఋణం తీర్చుకుంటా..దేవేందర్ నగర్ కాలనీ లొ మీ ఉద్యమానికి నేను అండగా ఉన్న నేడు నన్ను ఎమ్మెల్యే చేసిన మీకు నేను పట్టాలు ఇస్తా..ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ని అభివృద్ధి చేస్తా, పేదరికన్ని నిర్ములన చేస్తానని ఎన్నికల సమయంలో ప్రమాణం చేశాను..ఖానాపూర్ గ్రామంలో విధి దీపాలు లేక చీకటి అములుకుంది.. ఎన్నికలు అయినా 10 రోజుల్లో విధి దీపాలతో వెలుగులు నిపుతా..ఖానాపూర్ గ్రామానికి ఎ చిన్న ఆపద వచ్చిన

# ఇరుముడిలు తీసుకొని శివయ్య నీ చెంతకు వస్తున్నాం

**- గుమ్మడవెల్లి గ్రామంలో ఘనంగా శివ స్వాముల ఇరుముడి కార్యక్రమం**






హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం గుమ్మడవెల్లి గ్రామంలో శివ స్మరణతో మారుమోగిన శివ మహా పడిపూజ మరియు ఇరుముడి పూజ మరియు అగ్గిగుంట ప్రవేశములు అధిక సంఖ్యలో పాల్గొన్న శివ భక్తులు ఉదయం ఐదు గంటలకు రుద్రాభిషేకం స్వామివారికి, ఉదయం 6 గంటలకు అగ్నిగుండ ప్రవేశం తదుపరి ఇరుముడి కార్యక్రమం మహా పడిపూజ, 20 మంది శివ స్వాములతో సన్నిధాన్యంలో రోజు శివనామం స్వరాలు పలుకుతూ ఈరోజు ఆఖరి రోజు కావడం సన్నిధానంలో అనంతరం అన్నదాన ప్రభువులతో కాసుల మహేందర్ కుటుంబ సభ్యులతో అనగా అన్నప్రాసన కార్యక్రమం చేయడం జరిగింది.అన్నదాత ప్రభు తిరుమల ఇంజనీరింగ్ తిరుమల ట్రాక్టర్స్ కాసుల మహేందర్ కుటుంబ సభ్యులు మరియు గుమ్మడవెల్లి గ్రామ సర్పంచ్ పల్స మహేష్ గౌడ్, ఉప సర్పంచ్ మౌనిక సంతోష్, కొలను కూడా సర్పంచ్ గోరికల బీరప్ప,మాజీ సర్పంచులు గౌర ప్రభాకర్, కాసుల భద్రయ్య, పల్స మల్లయ్య, మస్క బాబు,వార్డ్ మెంబర్ ఏకుల మల్లేష్, ఏకుల మహేందర్, ఉండేలా బాబురావు, బేగంపేట్ మాజీ ఎంపీటీసీ వరికుప్పల బాలరాజ్, పల్స నరసింహ గౌడ్, నాణెంకాల శ్రీశైలం, గొని మల్లేష్ గౌడ్, గడిగే మహేందర్ గౌడ్, గడిగ శ్రీనివాస్ గౌడ్, దేవనూర్ శేఖర చారి, దేవేందర్ గౌడ్, మహేందర్ గౌడ్, మురళి, తాళ్ల శివకుమార్, రాఘవేందర్ గౌడ్,

# కల్వకుర్తి మున్సిపాలిటీలో కాంగ్రెస్ ప్రచారం ఉద్ధృతి









(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి 7:-

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కల్వకుర్తి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్, రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీ మల్రెడ్డి రాంరెడ్డి గారు కల్వకుర్తి మున్సిపాలిటీలోని 7, 15, 16, 17, 18వ వార్డుల్లో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకు వెళ్లి ప్రజలతో నేరుగా మమేకమవుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజల ఆశీస్సులు కాంగ్రెస్ పార్టీకి ఉన్నాయని, కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థులను ఘన విజయం సాధింపజేయాలని వారు కోరారు.ప్రజల సమస్యలను విని, వాటి పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు.కార్నర్ మీటింగ్లో వారు మాట్లాడుతూ---రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి, ఈ విజయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కానుకగా అందిద్దాం అని పిలుపునిచ్చారు.కల్వకుర్తి పట్టణ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ పాలనే మార్గమని వారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు తమ తమ వార్డుల ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రజల సహకారం, ఆశీర్వాదాలతో తమను గెలిపించి సేవ చేసే అవకాశాన్ని కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు, ఎడ్యుకేషన్ కమిషన్ మెంబర్ డా. చారకొండ వెంకటేష్, పీసీబీ మెంబర్ ఠాకూర్ బాలాజీ సింగ్, మాజీ జెడ్పీ ఛైర్మన్ రాంరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు పన్యాల జైపాల్ రెడ్డి, మెగావత్ గణేష్ నాయక్, నాయకులు శ్రీపాల్ రెడ్డి, దెంది శశిధర్ రెడ్డి, మెరుగు రమేష్ రెడ్డి, సోలిపురం వెంకట్రామ్ రెడ.

# ఉమ్మడి వరంగల్ జిల్లా మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో తీన్మార్ మల్లన్న





(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి 7:-


ఉమ్మడి వరంగల్ జిల్లా మునిసిపల్ ఎన్నికల ప్రచార పర్యటనలో భాగంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న భూపాలపల్లి జిల్లా హెడ్ క్వార్టర్లో నిర్వహించిన కార్యక్రమంలో మునిసిపల్ కౌన్సిలర్ అభ్యర్థులను ప్రజలకు పరిచయం చేశారు.ఈ సందర్భంగా భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు కౌటాం రవీందర్ బలపరిచిన ఐదు వార్డుల అభ్యర్థులకు మద్దతుగా మల్లన్న ప్రచారం చేశారు. మల్లన్న మాట్లాడుతూ, ఇప్పటివరకు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు ప్రజలు అనేకసార్లు అవకాశం ఇచ్చారని, అయినప్పటికీ మునిసిపాలిటీల్లో ప్రజల మౌలిక సమస్యలు అలాగే కొనసాగుతున్నాయని అన్నారు. ఈసారి ఒక్క అవకాశం తెలంగాణ రాజ్యాధికార పార్టీకి ఇస్తే, రాజకీయాలే కాదు అభివృద్ధి కూడా మారుతుందని, ప్రజల సమస్యలను నేరుగా పట్టించుకుని పరిష్కారం చేసే కౌన్సిలర్లను టి ఆర్ పి అందిస్తుందని ఆయన స్పష్టం చేశారు .భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలో,29వ వార్డు -- మమిడి శ్రీకాంత్,10వ వార్డు -కవిత కృష్ణ,18వ వార్డు -- గాజె వేణు గోపాల్, 22వ వార్డు -- శ్రీమతి కౌటాం సౌమ్య, 28వ వార్డు -- ఇనుగాల ప్రణయ్ రాజ్ గార్లు ప్రజల మధ్యే ఉంటూ వార్డు అభివృద్ధి కోసం పనిచేసే నాయకులని మల్లన్న తెలిపారు.షమునిసిపాలిటీలను అభివృద్ధి చేసి చూపించే బాధ్యత తెలంగాణ రాజ్యాధికార పార్టీ అభ్యర్థులదేనని, అందుకే ప్రజలు ఈసారి టి ఆర్ పి అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర నాయకత్వం, జిల్లా నాయకత్వం,పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# ప్రజా పాలనలోనే ప్రగతి బాట

**నారాయణపేట బహిరంగసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.**






(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి 7:-
గోదావరి జలాల ద్వారా తాండూరు, పరిగి, వికారాబాద్ ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. అలాగే, వచ్చే మూడేళ్లలో మక్తల్ -- నారాయణపేట -- కొడంగల్ ఎత్తిపోతల పథకం పూర్తి చేసి 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. "ప్రజా పాలన- ప్రగతి బాట" కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లా నారాయణపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. లక్ష్మీదేవిపల్లిలో రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణ పనులతో పాటు అవసరమైన ప్రణాళికలను చేపడుతామని ప్రకటించారు. తాండూరు పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులతో పాటు కాగ్నా నది నుంచి మంచినీటిని అందించే కార్యక్రమాలను పూర్తి చేస్తామని చెప్పారు. సంవత్సరం తిరిగేలోపు అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ, అక్కడి నుంచి తాండూరు వరకు రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. తెలంగాణ మణిహారంగా రీజినల్ రింగ్ రోడ్, అలాగే రేడియల్ రోడ్లను పూర్తి చేస్తామని, రాబోయే రోజుల్లో వికారాబాద్ అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మారబోతోందన్నారు. అనేక సమస్యలను అధిగమిస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతోందని, ప్రజలంతా సహకరించాలని కోరారు. తెలంగాణలో ప్రధానంగా రైతాంగం, నిరుద్యోగ యువత, మహిళలు ప్రాధాన్యంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెబుతూ ముఖ్యమంత్రి వాటిని వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వికారాబాద్ జిల్లాలోని 6,650 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి కింద 567.69 కోట్ల రూపాయల చెక్కును మహిళా ప్రతినిధులకు అందజేశారు. ఈ బహిరంగ సభలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహ

# ముమ్మాటికి కేసీఆర్ జాతిపితే మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి 7:-
చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎన్నికల ప్రచారాన్ని ఉద్ధృతంగా నిర్వహించారు. చేవెళ్ల టౌన్‌లో ఇంటింటి ప్రచారం, రోడ్ షో నిర్వహిస్తూ ప్రజలతో నేరుగా మమేకమై మాట్లాడారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ..చేవెళ్లలో ఎవరిని అడిగినా మళ్లీ కేసీఆర్ పాలనే రావాలని ప్రజలు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. రైతు బంధు, ఇంటింటికి తాగునీరు, రైతు భీమా, పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత పూర్తిగా కేసీఆర్ ప్రభుత్వానిదేనని ప్రజలు నేడు గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు. పేదల పెద్ద కొడుకులా పింఛన్లను రూ.200 నుంచి రూ.2,000 వరకు పెంచిన నాయకుడు కేసీఆర్ అని, ఆ మానవీయ పాలనను ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని అన్నారు. కేసీఆర్ పాలన ఒక స్వర్ణయుగంలా సాగిందని, ఆ కాలంలో ప్రజలకు భద్రత, నమ్మకం, అభివృద్ధి అన్నీ కలిసి ఉండేవని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రజాపాలన ప్రజాకంఠక పాలనగా మారిందని తీవ్ర విమర్శలు చేశారు. ఈ రాష్ట్రానికి మళ్లీ కేసీఆర్ పాలనే శ్రీరామరక్ష అని, తెలంగాణ ప్రజల భవిష్యత్తు బీఆర్ఎస్ చేతుల్లోనే సురక్షితమని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

# దాసర్లపల్లి తండ నుండి కడ్తాల్ కు రోడ్డుకు మరమ్మత్తులు వంకడావత్ బుజ్జి లక్ష్మణ్ నాయక్




హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల కేంద్రంలోని దాసర్లపల్లి తండా గ్రామ సర్పంచ్ వంకడావత్ బుజ్జి లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ... దాసర్లపల్లి తండా నుండి కర్తాల్ కు వెళ్లే దారి పూర్తిగా గుంతల మయంగా మారిపోవడంతో మట్టి రోడ్డును జెసిబి ట్రాక్టర్ డోజర్ల సహాయంతో మట్టి పోయించి రోడ్డుకు మరమ్మతులు చేయించడం జరిగింది గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు కొనసాగుతామని సర్పంచ్ తెలియజేశారు ఈ యొక్క కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంతోషిని రవి నాయక్, మరియు పంచాయతీ కార్యదర్శి రమేష్ వార్డు సభ్యులు వంకడావత్ బాలు, జరుపుల భారతి పాండు నాయక్, నేనావత్ సక్రు జరుకుల బద్రి నాయక్ లలిత చందర్ నాయక్ యొక్క కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# సాహెబ్ నగర్ లోని మహిళా సంక్షేమ సంఘం భవనమును ప్రారంభం





(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి 7:-
బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాహెబ్ నగర్ లో నిర్మించిన మహిళా సంక్షేమ సంఘం భవనమును బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి, ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మహిళల కోసం ఈ భవనం ఏర్పాటు చేయడం జరిగిందని ఈ భవనాలు మహిళలకు గౌరవం, భద్రత, ఆత్మవిశ్వాసం పెంచుతాయని తెలిపారు.అనంతరం సమావేశ సమయంలో కూర్చోవడానికి కుర్చీలు లేక ఇబ్బందికరంగా ఉందని సభ్యులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురావడంతో స్పందించిన కార్పొరేటర్ మహిళలు కూర్చోవడానికి తన సొంత నిధుల్లో నుంచి నూతన కుర్చీలను మహిళా సంక్షేమ సంఘం సభ్యులకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళ సంక్షేమ సంఘం సభ్యులు అరుణ,మమత, గాయత్రి, జ్యోతి, పద్మ, అమృత, అర్చన, లావణ్య, విద్యావతి, సంధ్య,సరిత మరియు సభ్యులు తదితరులు ఉన్నారు.

# అధికారులతో కలిసి భూగర్భ డ్రైనేజ్ పైప్ లైన్ పనులను పరిశీలన

**- కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి.**





(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి 7:-
హయత్ నగర్ డివిజన్ పరిధిలోని ముదిరాజ్ కాలనీలో తొలిసారిగా ఏర్పాటు చేస్తున్న నూతన భూగర్భ డ్రైనేజ్ పైప్ లైన్ నిర్మాణ పనులను స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి. సంబంధిత జలమండలి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని, నాణ్యతను స్వయంగా పరిశీలించి, పనులు వేగవంతంగా, ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కాలనీలో ఇప్పటివరకు భూగర్భ డ్రైనేజ్ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ కొత్త పైప్ లైన్ ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడం తమ బాధ్యత అని, డివిజన్‌లో ప్రతి కాలనీకి అవసరమైన అభివృద్ధి పనులు చేపడుతున్నామని కార్పొరేటర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ రాజగోపాల్, సూపెర్వైసోర్ బాలు, కాలనీవాసులు పాల్గొన్నారు..

# బైరాగిగూడా గ్రామంలో ప్రజలకు నేటి సమస్య ఉండకూడదు సర్పంచ్ పల్సా కృష్ణ గౌడ్




హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల కేంద్రంలోని బైరాగిగూడ గ్రామంలో గ్రామ సర్పంచ్ పల్సర్ కృష్ణ గౌడ్ మాట్లాడుతూ.. వేసవికాలం వస్తున్నడంతో గ్రామంలో ప్రజలకు నేటి సమస్య ఉండకూడదని మిషన్ భగీరథ నల్లలు కంట్రోల్ వాల్స్ కొత్తవి వేయించడం జరిగింది అదేవిధంగా గ్రామానికి మిషన్ భగీరథ డి ఈ జగన్మోహన్ రెడ్డి ఏఈ గోపి సింగ్ వచ్చి గ్రామాన్ని సందర్శించారు మిషన్ భగీరథ నీళ్ల సమస్య కొరత రాకుండా కావాల్సిన జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ అధికారులకు సూచించడం జరిగింది అధికారులు సానుకూలంగా స్పందించారు ఈ యొక్క కార్యక్రమంలో వార్డు సభ్యులు యాచారం లత, ఎలిమినేటి వినోద, ఇసంపాలి మంజుల, దేవేందర్, కిరణ్, ఇమ్రాన్, భగవత్, గ్రామపంచాయతీ కార్యదర్శి మహేష్ బాబు, వాటర్ లైన్మెన్ యాచారం అనిల్, గ్రామ పెద్దలు గ్రామ సిబ్బంది యొక్క కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ పార్టీ మహిళా ఆత్మీయ సమ్మేళనం





(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ప్రతినిధి 7:- ఎన్నికల ప్రచారంలో భాగంగాఇబ్రహీంపట్నం కేంద్రంలోని శాస్త్ర గార్డెన్ లో శనివారం రోజున శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, అధ్యక్షతన నిర్వహించిన మహిళ ఆత్మీయ సమ్మేళనం కి ముఖ్య అతిధి గా మంత్రివర్యులు సీతక్క, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి లు హాజరయ్యారు..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ దినదినా భివృద్ధి చెందుతుంది ధనిక రాష్ట్రాన్ని కెసిఆర్ అప్పుల పాలు చేసిండు బి ఆర్ ఎస్ - బీజేపీ నాయకులు చీకటి ఒప్పందలు కుదుర్చుకుని ముఖ్యమంత్రి పై ప్రభుత్వం పై అబద్దలను ప్రచారం చేస్తున్నారు. ప్రతిపక్షాలు అబద్దలానే అస్త్రాలుగా వాడుతున్నాయి అభివృద్ధి మీదనే మా ఆరాటం. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి పై చిత్తశుద్ధి తో ఉంది అప్పుల రాష్ట్రంలో ఇచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ వస్తున్నాము ప్రజలు మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించండి10 సంవత్సరకాలంలో బి ఆర్ ఎస్ చేసింది ఏమిలేదు... ఇబ్రహీంపట్నం లో కనీసం ఒక ప్రభుత్వ ఆసుపత్రిని కూడా కట్టించలేక పోయారు. కూని ఆపరేషన్ తో ఆడబిడ్డల ప్రణాలను బలితీసుకున్నారు. ప్రజాపాలనలో, ఎమ్మెల్యే రంగన్న కృషి తో నేడు ఇబ్రహీంపట్నం లో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం కాబోతుంది.కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండండి అభివృద్ధి కి బాటలు వేయండి, కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేశాము మహిళలకు వడ్డీ లేని రుణాలను ఇచ్చి వడ్డీలు ప్రభుత్వం బ్యాంకులకు కడుతుంది. మహిళలకు చక్కటి చీరలను ఇచ్చాము, పేదవాడి సొంతింటి కలను ఇందిరమ్మ ఇండ్లతో నెరవేర్చుము, ఇందిరమ్మ ఇండ్లకు 5లక్షలతో పాటు మహిళా సంఘాలతో ముందుగానే 2 లక్షలవరకు రుణాలను ఇప్పిస్తున్నాం.

# అమీర్ పేట్ గ్రామానికి 98 లక్షలు నిధులు విడుదల సిహెచ్ యాదయ్య



హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ మహేశ్వరం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాట్లాడుతూ... మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి చొరవతో గ్రామానికి డెవలప్మెంట్ కి హెచ్ఎండిఏ కింద కే ఎల్ ఆర్ స్పెషల్ ఫండ్ సహకారంతో 40 లక్షలు సీసీ రోడ్ల కోసం మరియు డ్రైనేజ్ 20 లక్షలు రజక సంఘం భవనానికి 30 లక్షల నిధులు గ్రామంలో లైటింగ్ కొరకు ఎనిమిది లక్షలు మొత్తం గ్రామానికి 98 లక్షల రూపాయలను గ్రామానికి మంజూరు చేయించినందుకు ప్రత్యేకంగా కిచ్చన్న గారి లక్ష్మారెడ్డికి గ్రామస్తులు తరఫున మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

## ఎలక్షన్ డ్యూటీకి కేటాయించబడ్డ సింగరేణి సిబ్బందికి యాజమాన్యం ఓడి మస్టర్ సౌకర్యం కల్పించాలి

**ఐ ఎన్ టి యు సి సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బి జనక్ ప్రసాద్**



**హైదరాబాద్ ఎస్టేట్ మంచిర్యాల**
సింగరేణిలో పనిచేస్తూ ఎలక్షన్ డ్యూటీలు నిర్వహిస్తున్నటువంటి సిబ్బందికి గత కొంతకాలంగా జరుగుతున్న ఆర్థికపరమైన నష్టాన్ని ఎన్నిసార్లు సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకుపోయినప్పటికీ యాజమాన్యం పెడచెవున పెడుతుండటం విచారకరం, గత కొంతకాలంగ కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని, ఐ ఎన్ టి యు సి తీవ్రంగా ఖండిస్తూ యజమాన్యం దృష్టికి సమస్యను తీసుకెళ్లడం జరిగింది. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అదే ఎలక్షన్ డ్యూటీలను వేసినప్పుడు ఆన్ డ్యూటీగా విధులు నిర్వహిస్తున్నప్పుడు, అదే ఎలక్షన్ డ్యూటీలను చేస్తున్న సింగరేణి సిబ్బందికి మాత్రం ప్రత్యేక లీవుగా పరిగణించడం తీవ్ర ఆక్షేపణీయం. ఎలక్షన్ డ్యూటీ పేరిట సింగరేణి సిబ్బందితో వెట్టి చాకిరి చేయించడం అన్యాయం. ఇప్పటికైనా యజమాన్యం ఆలోచించి ఎలక్షన్ డ్యూటీ నిర్వహిస్తున్న సిబ్బందికి ఓడి మాస్టర్ గా రిలీవింగ్ ఆర్డర్ లోనే నమోదు చేసి ఇవ్వాలని లేనియెడల ఎలక్షన్ డ్యూటీలకు సింగరేణి సిబ్బందిని ఒత్తిడికి గురిచేసి బలవంతంగా విధులకు పంపించకూడదని ఐఎన్టియుసి కార్మికుల పక్షాన డిమాండ్ చేస్తున్నది. అదేవిధంగా గతంలో ఎలక్షన్ డ్యూటీలు నిర్వహించిన కార్మికులకు ఓడి లుగా పరిగణించి వారికి జరిగిన ఆర్థిక నష్టాన్ని సరిచేసి ఎలక్షన్ డ్యూటీ చేసిన కార్మికులకు తగిన న్యాయం చేయాలని ఐ ఎన్ టి యు సి పక్షాన డిమాండ్ చేస్తున్నాం.అని తెలిపారు.

## అక్రిడిటేషన్ కార్డుల కొరకు దరఖాస్తుల స్వీకరణ

**- జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్, కలెక్టర్ కుమార్ దీపక్**



**హైదరాబాద్ ఎస్టేట్ మంచిర్యాల** అక్రిడిటేషన్ కార్డుల జారీ కొరకు అర్హులైన జర్నలిస్టుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో అక్రిడిటేషన్ మాడ్యూల్ వెబ్ సైట్ ప్రారంభించడం జరిగిందని, 2026-28 సంవత్సరానికి గాను అక్రిడిటేషన్ కార్డుల జారీ కొరకు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న అక్రిడిటేషన్ కార్డుల గడువు ఈ నెల 28వ తేదీతో ముగియనుందని, అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు నూతన అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. మీడియా యాజమాన్యాలు జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డుల కొరకు తమ ప్రతినిధుల పేర్లను జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయానికి పంపించాలని, తెలిపారు.

## హైదరాబాదు నగర అభివృద్ధికి రెండేళ్లలో రూ.20 వేల కోట్లు : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




**రంగారెడ్డి జిల్లా: ఫిబ్రవరి 7, (హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్)**
హైదరాబాదు నగర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కేవలం రెండేళ్ల కాలంలోనే రూ.20 వేల కోట్ల నిధులు కేటాయించిందని, రాష్ట్ర చరిత్రలో ఇదొక అపూర్వ నిర్ణయమని డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం హైటెక్స్‌లో నిర్వహించిన క్రెడాయ్ ప్రాపర్టీ ఎగ్జిబిషన్ షోలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.1,950.52 కోట్లు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు పరిధిలో రూ.12,500 కోట్లు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో రూ.4,365 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. పెట్టుబడులు, ప్రతిభ, జీవన నాణ్యత పరంగా హైదరాబాద్ దేశంలోని నగరాలతోనే కాకుండా ప్రపంచంలోని అగ్ర నగరాలతో పోటీ పడుతోందన్నారు.
హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న 27 పట్టణ స్థానిక సంస్థలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. ఈ నిర్ణయం ద్వారా ఒకే విధమైన పౌర సేవలు, సమగ్ర పట్టణ ప్రణాళిక, ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఏకీకృత అభివృద్ధి దృక్పథం సాధ్యమైందన్నారు.హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రోగ్రాం కింద రూ.7,032 కోట్లకు పైగా వ్యయంతో 45 ప్రధాన ఫ్లైఓవర్లు, అండర్‌పాసులు, 10 రోడ్డు విస్తరణ పనులు చేపట్టామని తెలిపారు. కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణకు రూ.1,090 కోట్లు వెచ్చిస్తున్నామని, పడమటి కారిడార్‌లో అంతర్జాతీయ సమాచార సాంకేతిక సంస్థ మరియు ఖాజాగూడ వద్ద రూ.837 కోట్లతో మల్టీలెవల్ ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నామని వివరించారు.ఉత్తర హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యల నివారణకు రూ.960 కోట్లతో ప్రత్యామ్నాయ రహదారి నెట్‌వర్క్‌లు, తూర్పు భాగంలో టీకేఆర్ కాలేజ్, గాయత్రి నగర్, మండమల్లమ్మ జంక్షన్ వద్ద రూ.416 కోట్లతో ఫ్లైఓవర్లు, దక్షిణ హైదరాబాద్‌లో రూ.863 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. నగరంలోని ఏ ప్రాంతాన్నీ నిర్లక్ష్యం చేయడం లేదని స్పష్టం చేశారు. ఈ అభివృద్ధి ప్రాజెక్టులు ప్రయాణ సమయాన్ని తగ్గిస్తూ, ఆర్థిక కార్యకలాపాలను బలోపేతం చేసి, భూవిలువలను పెంచుతున్నాయని, ముఖ్యంగా సాధారణ ప్రజల రోజువారీ జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయని అన్నారు.తెలంగాణ రైజింగ్ విజన్--2047 కింద క్లీన్--యూనిఫైడ్--రిజిలియంట్--ఈక్విటబుల్ వ్యూహంతో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. వరదల భద్రత, వాతావరణ అనుకూలత కోసం సమగ్ర స్టార్మ్ వాటర్ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని, సమగ్ర మొబిలిటీ, బ్లూ--గ్రీన్ మాస్టర్ ప్లాన్‌లను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.
దేశంలోనే అత్యంత నివసించదగిన, పెట్టుబడులకు అనుకూలమైన నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రజల సేవ కోసమే ఉందన్న నమ్మకాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని అన్నారు.

# నాంపల్లి అగ్నిప్రమాదం డీసీపీ స్పందన



**హైదరాబాద్, ఫిబ్రవరి 7 :** హైదరాబాద్ నగరంలోని నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్‌లో శనివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ల్యాబ్ భవనం మొదటి అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో కీలక పత్రాలు మంటల్లో కాలిపోయినట్లు సమాచారం. అయితే ఈ అగ్నిప్రమాదానికి సంబంధించి.. హైదరాబాద్ పోలీస్ సెంట్రల్ జోన్ డీసీపీ కె.శిల్పవల్లిమీడియాకు వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం మంటలు అదుపులోకి వచ్చాయని ఆమె తెలిపారు.ఈ ల్యాబ్ నుంచే నేరపరిశోధన.ఉదయం 10:00 గంటలకు అగ్ని ప్రమాదంపై సమాచారం అందిందని డీసీపీ శిల్పవల్లి వివరించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగిందని చెప్పుకొచ్చారు. నేర పరిశోధనకు సంబంధించిన ఫైల్స్, ఎవిడెన్స్‌కు సంబంధించి ఈ ల్యాబ్ నుంచే ఆపరేషన్ జరుగుతుందని తెలిపారు. మంటల్లో కీలక ఫైల్స్ కాలిపోయిన విషయంపై ఇంకా స్పష్టత లేదన్నారు. మొదటి అంతస్తులో కంప్యూటర్స్ ఉంటాయని ఆమె వెల్లడించారు.మంటలను పూర్తిగా అదుపు చేశాం..5 ఫైర్ ఇంజిన్‌ల సాయంతో మంటలను పూర్తిగా అదుపు చేశామని డీసీపీ తెలిపారు. ఈ కార్యాలయంలో పనిచేస్తున్న ఆఫీస్ బాయ్ మంటలను గమనించి సమాచారం అందించారని వివరించారు. ఆఫీస్ బాయ్ గమనించి వెంటనే మంటలార్పే ప్రయత్నం చేశారని అన్నారు. ఈ క్రమంలో అతను అస్వస్థతకు లోనయ్యారని.. వెంటనే 108లో ఆస్పత్రికి తరలించామని డీసీపీ తెలిపారు. ఈ ప్రమాదం జరిగినప్పుడు నలుగురు ఉద్యోగులు లోపలే ఉన్నారన్నారు. మంటలు గమనించి వారు సురక్షితంగా బయటపడ్డారని ఆమె చెప్పారు.విలువైన హార్డ్ డిస్కులు అగ్నికి ఆహుతి: డీఎఫ్ఓ శ్రీ దాస్తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో మంటలు అదుపులోకి వచ్చాయని డీఎఫ్ఓ శ్రీ దాస్ తెలిపారు. మొదటి అంతస్తులోని వివిధ కేసులకు సంబంధించిన సీజ్డ్ ప్రాపర్టీ విభాగంలో అగ్నిప్రమాదం సంభవించిందన్నారు. చాలా విలువైన హార్డ్ డిస్కులు, డాక్యుమెంట్స్ అగ్నికి ఆహుతయ్యాయని వివరించారు. ఇవాళ ఉదయం 10:22 గంటలకు అగ్నిప్రమాదం గురించి సమాచారం అందిందని ఆయన అన్నారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నామని.. అప్పటికే మంటలు ఎగసి పడుతున్నాయని తెలిపారు. కెమికల్ ల్యాబ్ మెటీరియల్ మొత్తం రెండో అంతస్తులో ఉందని చెప్పుకొచ్చారు. అయితే రెండో అంతస్తుకు మంటలు వ్యాపించలేదన్నారు. మొదటి అంతస్తులో సెన్సిటివ్‌గా ఉన్న ప్లాస్టిక్ వస్తువుల కాలిపోయాయని వివరించారు.హార్డ్ డిస్కులు పూర్తిగా కాలిపోయాయా? పాక్షికంగా కాలాయా? అన్నది పరిశీలించాలని డీఎఫ్ఓ తెలిపారు.

## హైదరాబాద్‌కు దీటుగా మెగా సిటీ కారిడార్ రేవంత్ సర్కార్ పెంటాసిటీ మాస్టర్ ప్లాన్ ఆ 5 నగరాలను కలుపుతూ



**హైదరాబాద్, ఫిబ్రవరి 7 :** తెలంగాణలో అభివృద్ధి అంతా హైదరాబాద్ చుట్టూనే కేంద్రీకృతమై ఉంది. ఇది కాదనలేని సత్యం. తెలంగాణ వ్యాప్తంగా డెవలప్‌మెంట్ జరగాలంటే నగరాలను విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. హైదరాబాద్ తర్వాత అతి పెద్ద నగరాలుగా వరంగల్, కరీంనగర్ పట్టణాలు నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి సరికొత్త, వినూత్నమైన విజన్‌ను ఆవిష్కరించారు. ఇప్పటికే 'ఫ్యూచర్ సిటీ' పేరుతో హైదరాబాద్ రూపురేఖలను మారుస్తున్న ప్రభుత్వం.. తాజాగా వరంగల్ ట్రై సిటీలు- హుజూర్‌నగర్, కరీంనగర్ నగరాలను కలిపి 'పంచనగరి' (ౄవత్ఖుఇఠ్ఎ )గా తీర్చిదిద్దే బృహత్తర సంకల్పం తీసుకుంది. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా.. కరీంనగర్ జిల్లాలో పర్యటించిన సీఎం రేవంత్ చేసిన ప్రకటన ఉత్తర తెలంగాణ భవిష్యత్తును మార్చే ఒక మాస్టర్ ప్లాన్‌లా కనిపిస్తోంది.ప్రస్తుతం హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలుగా ఉండగా.. సైబరాబాద్‌తో కలిపి అది ట్రై సిటీగా మారింది. ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీ పూర్తయితే అది క్వాడ్ సిటీ అవుతుంది. అయితే, ఉత్తర తెలంగాణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని వరంగల్, హన్మకొండ, కాజీపేట (త్రినగరి) ప్రాంతాలను కరీంనగర్, హుజూరాబాద్‌లతో అనుసంధానిస్తూ ఒకే 'సిటీ బెల్ట్'గా మార్చాలని రేవంత్ ప్లాన్ చేస్తున్నారు. ఇదే రేవంత్ రెడ్డి కలలుగంటున్న 'పంచనగరి'.అభివృద్ధే ధ్యేయంగా.హైదరాబాద్ నగరంపై విపరీతమైన ఒత్తిడిని తగ్గించి, ఉపాధిని వికేంద్రీకరించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశంగా తెలుస్తోంది. ఈ కారిడార్‌లో వరంగల్, కరీంనగర్ నగరాల వెలుపల రింగ్ రోడ్లను () నిర్మించి, వాటిని అనుసంధానించడం ద్వారా రవాణా వేగవంతం చేయటం లక్ష్యంగా పెట్టుకున్నారు. రెండు నగరాల మధ్య భారీ ఇంటిగ్రేటెడ్ డంప్ యార్డ్‌ను ఏర్పాటు చేసి, బయో వేస్ట్ పవర్ ప్లాంట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయడం, ఐటీ సెక్టార్ హబ్‌లను ఏర్పాటు చేయడంతో పాటు, ఇతర ఉపాధి మార్గాలకు ఈ ప్రాంతాన్ని కేంద్రంగా మార్చటం లక్ష్యంగా పెట్టుకున్నారు. వరంగల్‌లోని మామునూరు విమానాశ్రయం పూర్తి చేయడం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటు ఈ ప్రాజెక్టులో కీలకంగా మారనున్నాయి.రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను రేవంత్ రెడ్డి మూడు మండలాలుగా విభజించారు. : హైదరాబాద్ లోపల ఉండే కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ, , ప్రతిపాదిత ప్రాంతీయ రింగ్ రోడ్ మధ్య ఉన్న తయారీ రంగం. =ూ=జు: రీజినల్ రింగు రోడ్డుకు ఆవల ఉండే వ్యవసాయ అనుబంధ రంగాల ప్రాంతం. ఈ విభజనలో వరంగల్-కరీంనగర్ కారిడార్ తెలంగాణకు మరో హైదరాబాద్‌లా నిలవనుంది. తెలంగాణ అభివృద్ధి అంటే కేవలం హైదరాబాద్ మాత్రమే కాకుండా.. టైర్-2 నగరాలను ఆర్థికంగా బలోపేతం చేయడం ద్వారా సమతుల్య అభివృద్ధి సాధ్యవ ుతుందని ప్రభుత్వం భావిస్తోంది. వరంగల్ ఇప్పటికే విద్యా కేంద్రంగా ఉంది. దానికి కరీంనగర్ పారిశ్రామిక శక్తి తోడైతే ఉత్తర తెలంగాణ ఒక శక్తివంతమైన గ్రోత్ ఇంజిన్‌గా మారు నుంది. స్థానిక యువతకు ఉపాధి లభించడమే కాకుండా, ఎస్టేట్, వ్యాపార రంగాలు కొత్త పుంతలు తొక్కే ఛాన్స్ ఉంది.

# మార్చి 15 నుంచి అమల్లోకి వాహన్ ఇక ఆర్‌సీ కోసం ఎదురుచూపులు ఉండవు




**హైదరాబాద్, ఫిబ్రవరి 7 :**తెలంగాణ రాష్ట్రంలోని వాహనదారులకు ప్రభుత్వం ఒక తీపి కబురు అందించింది. వాహనాల రిజిస్ట్రేషన్, సంబంధిత సేవలను పూర్తిగా సరళతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'వాహన్' పోర్టల్‌ను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయ ుంచింది. ఈ కొత్త విధానం మార్చి 15 నుంచి అధికారికంగా ప్రారంభం కానుంది. దీనివల్ల మధ్యవర్తుల ప్రమేయం తగ్గి, పారదర్శకమైన సేవలు నేరుగా ప్రజల అరచేతిలోకి రానున్నాయివాహన్ పోర్టల్‌తో మారనున్న సేవలు:ఇప్పటివరకు రాష్ట్ర రవాణా శాఖ సొంత సాఫ్ట్‌వేర్ ద్వారా సేవలను అందించేది. అయితే, ఇప్పుడు జాతీయ స్థాయి పోర్టల్ అయిన 'వాహన్'లోకి మారడం వల్ల వాహనదారులకు అనేక లాభాలు కలగనున్నాయి.పేపర్‌లెస్ రిజిస్ట్రేషన్: కొత్త వాహనం కొన్నప్పుడు ఆర్‌టీఓ ఆఫీసుకి వెళ్లి గంటల కొద్దీ లైన్లలో నిలబడాల్సిన పని ఉండదు. డీలర్ పాయింట్ వద్దే ఆన్‌లైన్‌లో పత్రాలను అప్‌లోడ్ చేసి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవచ్చు.స్మార్ట్ ఆర్‌సీ నేరుగా ఇంటికే: రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యాక, మీ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ నేరుగా పోస్ట్ ద్వారా మీ ఇంటి చిరునామాకే వస్తుంది. దీనివల్ల ఆఫీసుల చుట్టూ తిరిగే శ్రమ తప్పుతుంది.నేషనల్ డేటాబేస్ అనుసంధానం: మీ వాహనం వివరాలన్నీ జాతీయ స్థాయి డేటాబేస్‌లో ఉండటం వల్ల, దేశంలో ఎక్కడైనా ట్రాఫిక్ పోలీసులు అడిగినప్పుడు ఆన్‌లైన్‌లో వివరాలు చూపెట్టడం సులభం అవుతుంది.ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు: గ్రీన్ ట్యాక్స్, లైఫ్ టైమ్ ట్యాక్స్ లేదా ఇతర రుసుములను నేరుగా పోర్టల్ ద్వారా డెబిట్/క్రెడిట్ కార్డులు లేదా యూపీఐ ) ద్వారా చెల్లించవచ్చు.ఎందుకు ఈ నిర్ణయం?రవాణా శాఖలో అవినీతిని అరికట్టడానికి, ప్రజలకు త్వరితగతిన సేవలను అందించడానికి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. 'వాహన్'తో పాటు లైసెన్స్ సేవల కోసం ఇప్పటికే 'సారథి' () పోర్టల్‌ను రాష్ట్రంలో విజయవంతంగా అమలు చేస్తున్నారు. మార్చి 15 నుంచి రెండు వ్యవస్థలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడంతో తెలంగాణ రవాణా శాఖ పూర్తి డిజిటలైజ్ కానుంది.

Wanted
MARKETING TEAMS
మార్కెటింగ్ టీం కావలెను
పార్ట్ టైం / ఫుల్ టైం
రిటైర్డ్ ఎంప్లాయిస్, గృహిణులు, జాబ్ లేని వారు, జాబ్ ఉన్న వారు..
స్టూడెంట్స్.. అందరూ అర్హులే.. ఏజ్ లిమిట్ లేదు.. లక్షల్లో ఆదాయం
డబ్బు సంపాదించాలన్న
కసి పట్టుదల ఉన్న ప్రతి ఒక్కరికి ఇదొక
సువర్ణావకాశం
ఒక పేదవాడు ధనవంతుడు అవ్వడానికి
ఉన్న ఏకైక మార్గం రియల్ ఎస్టేట్ మాత్రమే
ఈ గోల్డెన్ అవకాశాన్ని ఉపయోగించుకోండి
అలాగే ఈ నెంబర్ ని సంప్రదించండి
9391662839 / 9392112739

FCDA
Future City
Development Authority
ఈ పరియాలో రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ చేయుటకు స్త్రీ పురుషులు మరియు
రిటైర్మెంట్ ఎంప్లాయిస్ ఎల్ఐసి రియల్ ఎస్టేట్ ఫీల్డ్ వర్క్ చేయుటకు 25 ఏళ్ల పైబడిన
బాగా కష్టపడే వ్యక్తులు ఫస్ట్ పెరిటీగా తీసుకోబడును చదువు ఉన్న లేకున్నా పరవాలేదు
మిగతా డీటేయిల్స్ కొరకు సంప్ర : 9391662739 ద 9392112739

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
# హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

6
హైదరాబాద్ ఎస్టేట్




## శ్రీ సాయి సుమన్ డెవలపర్స్ ,సీనియర్ డైరెక్టర్ ఉపేందర్ సార్

Printed, Published & Owned by BATTU LAXMI NARAYANA ; Printed at BATTU PRINTERS, PLOT NO 30 ,ROAD NO 2. MADHRA NAGAR. MANSURABAD .LBNAGAR R R DIST., TELANGANA, Published from BATTU.PUBLICATIONS, H.NO PLOT NO 30 ,ROAD NO 2. MADHRA NAGAR. MANSURABAD .LBNAGAR, R R DIST. Editor: BATTU LAXMI NARAYANA, CELL:9951693876